క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో ఉన్న మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ బుధవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులు ఉన్నాయని, ఒక్కో కోర్సులో 40 సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు ఈనెల 25 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బోధన్‌లో రక్తదానం



బోధన్ టౌన్: పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో ఉన్న రక్త నిల్వ కేంద్రానికి బుధవారం పలువురు యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వల కొరత ఉన్న దృష్ట్యా బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు చిత్రాల చిన్న ప్రమోద్ కుమార్‌ను సంప్రదించడంతో పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సాకేత్ వర్మ, నిఖిల్, ప్రమోద్, మహేందర్, సాత్విక్, భాను, ప్రదీప్, నిఖిల్, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కూలి రేట్లు పెంచాలి



ఎడపల్లి: ఉపాధి హామీ కూలీలకు కూలి రేట్లు పెంచాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ బుధవారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ. 300 కూలీ రావటం లేదని, టెంట్లు లేవని మంచినీరు లేదని సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం కొలతలు లేకుండా పని పని కల్పించాలని కోరారు. ఆయన వెంట కె.రవి, లక్ష్మణ్, శంకర్, ఉపాధి కూలీలు ఉన్నారు.

డొంకేశ్వర్‌లో 78.18 శాతం పోలింగ్

- అత్యధికంగా మారంపల్లిలో 82.83 శాతం

డొంకేశ్వర్: ఇటీవల నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా 78.18 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం ఓటర్లు 16,679 మంది ఉండగా, ఇందులో 9,015మంది మహిళలు, 7,664 మంది పురుషులు ఉన్నారు. పోలింగ్ రోజున పదమూడు గ్రామాల పరిధిలోని 19 పోలింగ్ కేంద్రాలు కలిపి 13,040 మంది ఓటు వేశారు, ఇందులో 7,516మంది మహిళలు ఉండగా, 5,524మంది పురుషులు ఉన్నారు. అత్యధికంగా మారంపల్లి పోలింగ్ కేంద్రంలో 82.83 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా డొంకేశ్వర్ మహిళా పోలింగ్ కేంద్రంలో 70.98 శాతం ఓట్లు పోలయ్యాయి. అదే విధంగా ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మండలంలో నాలుగు శాతం పోలింగ్ తగ్గింది.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఖలీల్‌వాడి: ప్రభుత్వంలోని వివిధ శాఖలలో గల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా సుమారు 1000 మంది విశ్రాంత ఉద్యోగులు పనిచేస్తున్నారని వారిని తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారితో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నాయకులు ఓమయ్య, రాజన్న, రఘురాం, రంజిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ఖలీల్‌వాడి: ఇటీవల ఎన్నికల విధుల్లో ఉన్న ఆర్మూర్ మెప్మా ఆర్పీ గంగమణిపై దురుసుగా ప్రవర్తించిన ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై ఎన్నికల అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాకేష్‌రెడ్డి దూకుడుతత్వం వల్ల ఒక మహిళ ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడ్డారని, దీనికి ఆయన బాధ్యత వహించాలన్నారు. గంగమణికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

17న జాబ్ మేళా

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఈనెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అంబోజీ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, రిలియన్స్ అడ్డా, పేటీఎం, ఆక్సిస్ బ్యాంకు, ఫాక్స్‌కాన్ వివిధ కంపెనీల అధికారులు వస్తున్నారన్నారు. డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికెట్లతో శుక్రవారం ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరుకావలన్నారు.

మరమ్మతులకు నోచుకోక..

- ప్రధాన కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు, ఇసుక మేటలు
- సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం



శిథిలావస్థలో తూము



నిజాంసాగర్ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

నందిపేట్: సాగునీటి రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ రూ. లక్షలు ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా సాగుతోంది. మండలంలోని 12 గ్రామాలకు నిజాంసాగర్ డి-74 కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రధాన కాలువకు ఉన్న తూములు, తలుపులు విరిగిపోయి సాగునీరు వృథాగా పోతోంది. గతంలో ఎప్పుడో ఒక్కసారి తూములు రిపేరు చేయించి వదిలేశారు. ప్రస్తుతం ప్రధాన కాలువ పిచ్చి మొక్కలు, పొదలతో ఇసుక మేటలతో నిండిపోయింది. ఈ కాలువ సుమారు 30 వేల నుంచి 40 వేల ఎకరాల వరకు సాగునీరందుతుంది. ప్రతి ఖరీఫ్, రబీ పంటలకు నీరు అందించే ఈ ప్రధాన కాలువకు మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న గుత్ప ఎత్తిపోతల పథకం నుంచి గుత్పలోని ఖజాన చెరువులోకి నీరు చేరుతుంది. ఇక్కడి నుంచి ఆర్మూర్ మాక్లూర్, నందిపేట మండలాల పంట పొలాలకు చేరుతాయి. అదేవిధంగా గుత్ప చెరువు నుంచి నిజాంసాగర్ ప్రధాన కాలువ గుండా గ్రామాల చెరువులకు వెళ్తాయి. గాలిబ్‌నగర్ నుంచి నందిపేట వరకు ఉన్న కాలువ అధ్వానంగా మారింది. దీంతో మండలానికి కాలువ ద్వారా నీరు రావాలంటే రెండు రోజులు పడుతుంది. వదిలిన నీరు పిచ్చి మొక్కలు, ఇసుక మేటలు దాటుకుంటూ పంట చేనులకు, చెరువులకు వెళ్లాలంటే గగనంగా మారుతోంది. పిల్ల కాలువల్లో సైతం పూడిక చేరడం, శిథిలావస్థకు చేరడం, కొందరు రైతులు తమ పొలాల్లో కలుపుకోవడంతో పిల్ల కాలువలు ఆనవాళ్లు లేకుండా కోల్పోయాయి. చివరి ఆయకట్టు వరకు నీరు చేరాలంటే రైతులు ముప్పుతిప్పలు పడాల్సి వస్తోంది. ఖరీఫ్ చివరి దశలో వర్షాలు లేకున్నా, రబీలో కొందరు రైతులకు బోరు బావులు ఉన్నా పొట్టదశలో భూగర్భ జలాలు అడుగంటి వట్టిపోవడంతో గుత్ప నీరు మీద ఆధారపడాల్సి వస్తోంది. ప్రస్తుతం సాగునీటి కోసం ఎంతో ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తహసీల్దార్ తీరుపై అసంతృప్తి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దళిత ఐక్య వేదిక సభ్యులు

రుద్రూర్: కుల ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయడంలో తహసీల్దార్ వెంకటేశం ఇబ్బందులకు గురి చేస్తున్నారని దళిత ఐక్య వేదిక సభ్యులు ఆరోపించారు. ఈ విషయమై సభ్యులు బుధవారం మధ్యాహ్నం తహసీల్ కార్యాలయానికి చేరుకొని కుల ధ్రువీకరణ జారీకి అవసరమయ్యే అన్ని పత్రాలు దరఖాస్తుతో సమర్పించినా అఫిడవిట్ ఎందుకు కావాలని డిమాండ్ చేస్తున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. ఎక్కడా లేని విధంగా నిబంధనలు పెట్టడం సరి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కొంత సేపు తహసీల్దార్‌తో వాగ్వివాదం జరిగింది. విద్యార్థులను, నిరుపేదలను, నిరుద్యోగులను ఇలా ఇబ్బంది పెట్టకుండా త్వరగా సర్టిఫికెట్ జారీ చేయాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట వారు విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా క్యాస్ట్ సర్టిఫికెట్ జారీలో ఇబ్బందులు ఎదురవుతున్నందున తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. పేదలు అఫిడవిట్ తేవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ఎంక్వయిరీ చేసి క్యాస్ట్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరామని అన్నారు.

మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డికి సన్మానం



సుభాష్‌నగర్: రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ఇటీవల ఎరువుల కంపెనీ ఇఫ్కో జాతీయ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా బుధవారం నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఆయనను ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సన్మానించారు. సీఈఓ, డైరెక్టర్లు, బ్యాంకు జనరల్ మేనేజర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం, శరత్, గిర్ధావర్ గంగారెడ్డి, క్యాసాల శ్రీనివాస్‌రెడ్డి, శరత్, శంకర్, ఆనంద్, నాగంపేట్ శేఖర్‌రెడ్డి, సీఈఓ నాగభూషణం వందే తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సయ్య

పెర్కిట్: వర్షకాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యుత్, వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పస్క నర్సయ్య సూచించారు. ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షకాల ప్రారంభంలో ఈదురు గాలలు వీచే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పని చేయాలన్నారు. దీంతో పాటు అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కడ్తా లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కృషి చేస్తామన్నారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నా సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఎంపీపీ రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ గజానంద్, ఎంపీడీవో సాయిరాం, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం, పీఆర్ ఏఈ నితీశ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వీధి కుక్కల వీరంగం

- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- ఇటీవల దాడిలో నాలుగు గొర్రెలు మృత్యువాత
- చిన్నారులకూ పొంచి ఉన్న ముప్పు



డొంకేశ్వర్‌లో సంచరిస్తున్న వీధి కుక్కలు

డొంకేశ్వర్: మండల కేంద్రంలో వీధి కుక్కలు వీరంగం చేస్తున్నాయి. గొర్రెల మందపై గుంపులుగా దాడి చేసి వేటాడి చంపుతున్నాయి. ఇటీవల 17వ వీధి ఎస్సీ వాడలో నాలుగు గొర్రె పిల్లలను చంపేశాయి. మనుషులను కూడా కరిచేందుకు వస్తున్నాయని పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఓ గ్రామ పంచాయతీ కార్మికుడిని కుక్కలు వెంబడించడంతో ఆయన వేగంగా పరుగెత్తి వాటి నుంచి తప్పించుకున్నాడు. అయితే వీధుల్లో ఆడుకునే చిన్నారులపై కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయన్న భయంతో వారిని ఇళ్ల నుంచి బయటకు రానివ్వడం లేదు. గతంలో కూడా కుక్కకాటు ఘటనలు, పశువులపై దాడులు జరిగాయి. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టినప్పటికీ మండల కేంద్రంలో మళ్లీ వాటి సంచారం పెరిగింది. ప్రస్తుతం గొర్రెల మందలను టార్గెట్ చేసి చంపుతుండడంతో యజమానులు నష్టపోతున్నారు. అలాగే పిల్లలు, పెద్దలు కుక్కల బారిన పడి ప్రాణనష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల కేంద్రంలోనే కాకుండా చుట్టు పక్కల ఉన్న కోమట్‌పల్లి, నికాల్‌పూర్, అన్నారం, సిర్పూర్, జీజీ నడ్కుడ, గాదేపల్లి, చిన్నయానం, నూత్‌పల్లి, మారంపల్లి, గంగసరం, దత్తాపూర్, తొండాకూర్ గ్రామాల్లో సైతం వీధి కుక్కల బెడద తీవ్రంగానే ఉంది.

వీధి కుక్కలతో భయంగా ఉంది



రెండు రోజుల క్రితం వీధి కుక్కలు గొర్రెలపై దాడి చేశాయి. నాలుగు పిల్లలు చనిపోయాయి. ఇప్పుడు ఆ కుక్కలు మనుషుల మీదికి కూడా వస్తున్నాయి. ఇంట్లోంచి చిన్న పిల్లలను బయటకు పంపాలంటే భయంగా ఉంది. అధికారులు వెంటనే స్పందించి కుక్కలను పట్టుకెళ్లాలి. – కందెల సురేశ్, డొంకేశ్వర్

నడిరోడ్డుపై గుంత.. ఆదమరిస్తే అంతే..



చిక్లి శివారులో రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు

మాక్లూర్: మండలంలోని చిక్లి శివారులో ఉన్న రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం నిజామాబాద్ నుంచి పాల్దా, జన్నేపల్లి, నందిపేట, నవీపేట, నందిపేట, నిర్మల్ నుంచి వయా బాసర, లోకేశ్వర్ వరకు ఆర్టీసీ బస్సులు, పలు వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మండలంలోని చిక్లి శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న రోడ్డుపై నాలుగు నెలల క్రితం భారీ గుంత ఏర్పడింది. కానీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో గుంతను గమనించని పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతను పూడ్చివేసి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంతను పూడ్చాలి



చిక్లి శివారులో ఏర్పడ్డ ఈ భారీ గుంతను అధికారులు పూడ్చి వేయాలి. ఈ గుంత నాలుగు నెలల క్రితం ఏర్పడింది. నాటి నుంచి అలాగే ఉండడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. అయినా అధికారుల్లో మాత్రం చలనం రాలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. – పి నర్సింగ్‌రావు, చిక్లి

చరిత్రలే భావితరాలకు ఆధారం



ఆర్మూర్‌టౌన్: కవులు, రచయితలు ఉన్నంతకాలం వారు రచించిన చరిత్రలే భావితరాలకు గుర్తుండిపోతాయని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం 'అల్లకొండ ఊరు ఉద్భవం- ఐదు ఆలయాలకు ప్రసిద్ధి' అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టడం గొప్ప కాదు సమాజానికి ఏం చేశవనేదే గొప్పఅని పేర్కొన్నారు. తన గురువైన బ్రహ్మారౌతు నర్సింగ్‌రావు రచించిన ఈ పుస్తకం నేటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో పోల రాఘవేంద్రదీప్తి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన లయన్స్ భవనాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేమూరి లక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి బుధవారం ఇక్కడ కంటి పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. లయన్స్ కార్యక్రమాలకు సహకరించడంతో పాటు లయన్స్ భవనాన్ని నిర్మించి ఇచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త, భవన నిర్మాణ దాత పోల విఠల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ బస్వేశ్వరరావు, కొడాలి కిశోర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జి.హన్మంత్ రావు, కార్యదర్శి జానకి రావు, కోశాధికారి అనిల్ కుమార్, కేవీ మోహన్, శ్రీనివాస్ రావు, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్ధు, మాజీ సర్పంచులు హంగర్గా స్వరూప, పత్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పంట డబ్బుల కోసం వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

డొంకేశ్వర్: శనగ పంటను విక్రయించిన తమకు డబ్బులు చెల్లించాలని కోరుతూ సంబంధిత రైతులు బుధవారం తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. క్వింటాలుకు ఎంత ధర కట్టిస్తారనే దానిపై ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదని, రూ.7,500 కట్టివ్వాలన్నారు. ఇప్పటికే పంట సాగు చేసినందుకు తీసుకున్న అప్పులకు వడ్డీ పెరుగుతోందని, ఖరీఫ్ సాగుకు చేతిలో చిల్లి గవ్వ కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. పంట డబ్బులు త్వరగా చెల్లించాలని, లేదంటే శనగ పంటను తిరిగి ఇవ్వాలని రైతులు అధికారులను కోరారు.

వికసించిన మే పుష్పం



బోధన్ టౌన్: ఏడాదిలో మే నెలలో మాత్రమే వికసిస్తుంది మే పుష్పం. పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌లో కాలనీలో ఉన్న నాగభూషణం ఇంట్లో బుధవారం మే పుష్పం వికసించింది. సంవత్సరానికి ఒకసారి పూసే ఈ పూలమొక్కలను తాను గత పదేళ్లుగా పెంచుతున్నట్లు తెలిపారు. కాలనీవాసులు పుష్పాన్ని చూసేందుకు ఆసక్తి చూపారు. మే పుష్పం వద్ద పలువురు సెల్ఫీలు తీసుకున్నారు.

హంస వాహనంపై నరసింహుడు



భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి ఉత్సవమూర్తులను ఆలయ కమిటీ సభ్యులు హంస వాహనంపై ఉంచి ఊరేగించారు. ఆలయంలో ఉదయం దీపారాధన, స్వస్తి పుణ్యావహచనం, మాతృక, మంటప దేవతాస్థాపన నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై లక్ష్మీనృసింహ స్వామి విగ్రహాలను ఉంచి ఊరేగించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 01.20, ఆరంభం (తెలుగు) - 4.15, ప్రసన్న వదనం (తెలుగు) - 7.10, బ్రహ్మచారి (తెలుగు) 10.15
- స్క్రీన్-2 – కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ - 11.45, 2.55, 6.05, 9.15
- స్క్రీన్-3 – ప్రతినిధి-2 (తెలుగు) - 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) - 3.10
- స్క్రీన్-4 – కృష్ణమ్మ (తెలుగు)- 12.45, 3.40, 6.35, 9.30

22న లక్ష్మీనరసింహస్వామి తిరుక్కల్యాణోత్సవం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని మహాలక్ష్మినగర్‌లో ఈనెల 22న లక్ష్మీ నరసింహ స్వామి తిరుక్కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు రాచకొండ రుక్మిణి నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. గంగోత్రి రామానుజాదాసన్ స్వామీజీ పర్యవేక్షణలో లక్ష్మీనరసింహ స్వామి ఏకోత్తర సహస్ర కలశ అభిషేకం, లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందురోజు 21న సాయంత్రం 6గంటలకు పండితులు నాని స్వామి స్వగృహం నుంచి స్వామి వారి ఊరేగింపు బయలుదేరి పూలాంగ్ హనుమాన్ జంక్షన్ మీదుగా మహాలక్ష్మి నగర్ చేరుకుంటుందని వారు తెలిపారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

సొసైటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం



నియామక పత్రాన్ని అందజేస్తున్న డీసీవో



సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న రైతులు

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా వెంకంగారి జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో శ్రీనివాసరావు ప్రకటించారు. గత సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై ఇటీవల మెజారిటీ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టగా ఇటీవల నెగ్గిన విషయం తెలిసిందే. ఈమేరకు డీసీవో శ్రీనివాసరావు బుధవారం సొసైటీ కార్యాలయంలో నూతన చైర్మన్ ఎంపిక కోసం ఎన్నిక నిర్వహించారు. ఈఎన్నికలో 12 మంది సొసైటీ డైరెక్టర్లు పాల్గొనగా, చైర్మన్ పదవి కోసం జనార్దన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో జనార్దన్‌ను సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీసీవో పేర్కొన్నారు. అనంతరం నూతన చైర్మన్‌కు నియామక పత్రాన్ని అందజేసి, వారితో ప్రమాణస్వీకారం చేయించారు. జనార్దన్ మాట్లాడుతూ.. సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రైతులు , నాయకులు నూతన చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. వైస్ చైర్మన్ మామిడి రాములు, సీఈవో గంగా నర్సయ్య, మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి, పాప గంగారెడ్డి, సుభాష్, నరేందర్, ధర్మేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశహితమే ఎజెండాగా పోలింగ్



సుభాష్‌నగర్: దేశ హితమే ఎజెండాగా, ప్రజాస్వామ్య విలువలు కాపాడేవిధంగా నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు పోలింగ్‌లో పాల్గొన్నారని శాసన సభా పక్ష మాజీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం అనే నినాదంతో ప్రజలు ఓట్లు వేశారని తెలిపారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన అధికార, పోలీస్ యంత్రాంగానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామీణ గ్రంథాలయానికి గోర్తి ఈశ్వర ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉషాబాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పుస్తకాలను వితరణ చేశారు. ఈమేరకు ట్రస్ట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాట్కురి తిరుపతిరెడ్డి బుధవారం 40 రకాల పుస్తకాలను లైబ్రరీకి అందించారు. అంకం నరేష్, అల్లూరి గంగారెడ్డి, సట్ల సాయన్న,లోక పురుషోత్తం, లోక మహేందర్‌రెడ్డి, బాలాగౌడ్,సుమన్, ప్రవీణ్, తంబాకుల గంగారెడ్డి, రుస్తుంఖాన్ పాల్గొన్నారు.